బోనమెత్తిన ఏడుపాయల

● దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఘనంగా బోనాలు ● సరస్వతీదేవీ రూపంలో ఏడుపాయల వనదుర్గామాత దర్శనం

దుర్గామాతకు పూజలు చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

బోనం ఎత్తుకుని నృత్యం చేస్తున్న జోగిని

పాపన్నపేట, అక్టోబర్ 20: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటపాటలతో, నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ శివసత్తుల నృత్యాల మధ్య ఎంతో వైభవంగా బోనాలు తీశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన జోగిని బోనంతో నృత్యం చేయడం పలువురిని ఆకర్షించింది. ఆలయ చైర్మన్ బాలాగౌడ్ బోనం ఎత్తుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి ఏడుపాయలకు హాజరైన భక్తులు బోనాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

☛ ఏడుపాయల వనదుర్గామాతను శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది, వేద పండితులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ఆలయ మర్యాదల ప్రకారం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ బాలాగౌడ్ తదితరులున్నారు.

దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు ఏక గ్రీవ తీర్మానం చేసి ప్రతిజ్ఞ చేస్తున్న యువజన సంఘాలు

ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు ఏకగ్రీవ తీర్మానాలు

చేగుంట, అక్టోబర్ 20: దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీ గెలువాలని చేగుంట మండలంలోని పలు యూత్ సంఘాలు ఏక గ్రీవ తీర్మానాలు చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు రంగయ్యగారి రాజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చేగుంట మండలం బీ కొండపూర్ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం సమీపంలో దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మోజార్టీ గెలిపించుకుంటామని వివేకానంద, అంబేద్కర్, ఛత్రపతి శివాజీ యూత్ సంఘాల సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి తప్ప ఇతర పార్టీలకు ఓటు వేయమని ఏక గ్రీవ తీర్మానం చేశారు.

బెల్ట్ షాపుపై దాడి.. మద్యం పట్టివేత

చిలిపిచెడ్, అక్టోబర్ 20:అజ్జమర్రిలో బెల్ట్ షాపుపై పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి అనుమతి లేకుండా నిల్వఉంచిన 6.15 లీటర్లు మద్యం పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన హన్మంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మెదక్ రూరల్, అక్టోబర్ 20: గుర్తు తెలియని ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని పాతూరు గ్రామ శివారులో జరిగింది. మెదక్ రూరల్ ఎస్ఐ అమర్ కథనం ప్రకారం గుర్తు తెలియని మహిళ (65) పాతురులో భిక్షాటన చేస్తూ బస్టాండ్ వద్ద పడుకునేది. ఈనెల17న వృద్ధురాలు అనారోగ్యంతో ఉండగా గ్రామస్తులు 108కు ఫోన్ చేసి మెదక్ ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వైద్యులు సర్పంచ్‌కు తెలిపారు.

ఎన్ఎస్ఎఫ్ సబ్ స్టేషన్‌లో ఆయుధ పూజ

మెదక్ రూరల్, అక్టోబర్ 20: మండలంలోని మంబోజిపల్లి శివారులోని ఎన్ఎస్ఎఫ్ సబ్‌స్టేషన్ విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయుధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈ జానకీరాం, డీఈ కృష్ణరావు, ఏఈ తిరుపతిరెడ్డి, డివిజన్ సెక్రటరీ ప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు నగేశ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలపై సమీక్ష

మాట్లాడుతున్న ఎంపీడీవో జగదీశ్వర్

నిజాంపేట, అక్టోబర్ 20: నిజాంపేటలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో జగదీశ్వర్ పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై పంచాయతీ కార్యదర్శులు, అశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, తాగునీరు, కరెంట్, వీల్‌చైర్, ఫర్నీచర్ వంటి మౌలిక సదుపాయలపై అధికారులతో చర్చించామని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీవో రాజేందర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఓటరు నమోదు: తహసీల్దార్

మెదక్ రూరల్, అక్టోబర్ 20: 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు కావడానికి ఈ నెల 30వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మెదక్ మండల పరిధిలోని వెంకటపూర్‌లో పోలింగ్ బూత్ స్థాయిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు లిస్టులో పేర్లు గల్లంతైన వారు, 18 ఏండ్లు నిండినవారు ఈ నెల 30వతేదీలోపు తమ పేర్లను ఓటరు లిస్టుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో చేసుకొనేవారు http://www.nvsp.in, పోర్టల్ ద్వారా, voter helpline యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు బూత్ లెవల్ అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్యలక్ష్మి రవీందర్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు పాల్గొన్నారు.

పిల్లుట్లలో ఘనంగా శివపార్వతుల పెండ్లి

శివ్వంపేట, అక్టోబర్ 20: మండలంలోని పిల్లుట్లలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సర్పంచ్ పెద్దపులి రవి ఆధ్వర్యంలో, భవానీ ఉత్సవ కమిటీ సహకారంతో శివపార్వతుల కల్యాణం అత్యంత కమనీయంగా జరిగింది. గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కల్యాణ వేడుకలకు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తాతో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ గుర్రాల ఆంజనేయులు, కమ్మరి నరేందర్, మాజీ ఉపసర్పంచ్ దామోదర్ రెడ్డి, పిల్లి వెంకటయ్య, మాజీ చైర్మన్ శ్రీధర్ గౌడ్, సుదర్శన్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ న్యాయ సహాయం అందించాలి

● జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

మెదక్ అర్బన్, అక్టోబర్ 20: ప్రతి బాధితుడికి ఉచిత న్యాయ సహాయం అందించాలని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, అండర్ మోడల్ స్కీం కౌన్సిల్స్, ప్యానెల్ లాయర్స్, రిటేనర్ లాయర్స్‌తో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. సమావేశంలో న్యాయవాదులు శ్రీపతిరావు, దుర్గారెడ్డి, రామ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లా కేంద్రంలోని రామాలయంలో బతుకమ్మ సంబురాల్లో మహిళలతో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి

తెలంగాణ ప్రజలది

పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నదని, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ అధికారిణి బ్రహ్మాజీ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో శుక్రవారం మహిళలు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గ్రామంలోని ప్రధాన వీధుల వద్ద ఉంచి మహిళలు బతుకమ్మలు ఆడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. బతుకమ్మ ఆట ఆడిన అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేశారు. – నర్సాపూర్/వెల్దుర్తి/చేగుంట/మెదక్ అర్బన్/పెద్దశంకరంపేట/కొల్చారం/చిన్నశంకరంపేట/మెదక్ రూరల్/అల్లాదుర్గం/రామాయంపేట, అక్టోబర్ 20

నర్సాపూర్: బతుకమ్మ ఆటతోపాటు ఓటర్ ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కౌడిపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు